



ఆకట్టుకుంటున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళా

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళాలో సందర్శకులు పలు ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మంగళవారం శాంతి చంద్రిక వరవీణా మ్యూజిక్ అకాడమీ బృందం స్వరాంజలి అందరిని ఆకట్టుకుంది. చంద్రశేఖర్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. ఇందులో గజవదన, శివాష్టకం, కామాక్షిస్తుతి, బాలగోపాల, తరంగం, చంద్రశేఖరం, తక్కువేమి మనకు, మరకతమణిమయ, తదితర అంశాలను కళాకారులు ఐశ్వర్య, భావన, మేఘన, హరిప్రియ, హర్షిని, ప్రీతిక, శ్రీవిద్య, సౌమ్య, మనస్వీ తదితరులు ప్రదర్శించారు.



రూ.కోటితో అభివృద్ధి పనులు ప్రారంభం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల గ్రీన్‌ల్యాండ్ కాలనీలో రూ. 50 లక్షలతో సీసీ రోడ్లు, ఇందిరమ్మ కాలనీలో రూ. 50 లక్షలతో డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల పనులను చేపట్టేందుకు ప్రణాళికలతో పనిచేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఇప్పటికే అనేక వార్డులలో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లంకల పద్మవీరారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, నాయకులు డి.లక్ష్మణ్, జి.శ్రీరాములు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ భవనం ప్రారంభం

బండ్లగూడ: రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో రూ.90 లక్షలతో నిర్మించిన పెన్షనర్స్ భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 17న పెన్షనర్స్ డే సందర్భంగా ఈ భవనం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సీనియర్ సిటిజన్స్ సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. అనంతరం సంఘం సభ్యులందరినీ ఆయన శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, మేయర్ లతాప్రేమ్‌గౌడ్, కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్లు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులను విడుదల చేయాలి

బీఆర్ఎస్ నాయకులు



మక్తమహబూబ్‌పేట గ్రామంలో .. వినతిపత్రాలతో బీఆర్ఎస్ నాయకులు

రాయదుర్గం: లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ సాయిబాబా డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు నానక్‌రాంగూడలోని అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం వినతి పత్రం సమర్పించారు. అంతకుముందు నానక్‌రాంగూడ అండర్‌బ్రిడ్జి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి బుద్ధిని ప్రసాదించి లగచర్ల రైతులను జైలు నుంచి విడుదల చేసేలా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చెన్నంరాజు, జంగయ్యయాదవ్, దారుగుపల్లి నరేష్, సతీష్ ముదిరాజ్, అశోక్, అంజమ్మ, జగదీశ్, యాదగిరి, నారాయణ, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్ మక్తమహబూబ్‌పేటలో..

మియాపూర్: లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసి వెంటనే వారిని విడుదల చేయాలని శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనకు నిరసనగా మంగళవారం మియాపూర్ మక్తమహబూబ్‌పేట గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతులను విడుదల చేయని పక్షంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ కిరణ్ యాదవ్, గోపరాజు శ్రీనివాస్‌రావు, నర్సింగ్, హనీఫ్, శ్రీనివాస్, రవి, రాజు, కృష్ణంరాజు, ముజీబ్, సమీర్ తదితరులున్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దుకాణాల బహిరంగ వేలం



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ గుట్టపై ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో దుకాణాల నిర్వహణ కోసం మంగళవారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో కొబ్బరికాయల దుకాణం నిర్వహణకు పద్మ రూ. 7.21లక్షలు, లడ్డు పులిహోర విక్రయాలకు చంద్రశేఖర్ రూ. 5.50 లక్షలు, కొబ్బరి చిప్పల సేకరణకు లక్ష్మణరావు రూ.1.50లక్షలు, అమ్యూజ్‌మెంట్ పార్క్ నిర్వహణకు సందీప్‌రెడ్డి రూ. 8,11,11లకు వేలం పాటలో దక్కించుకున్నారు. దేవాలయానికి రూ. 22.32 లక్షల ఆదాయం వచ్చిందని అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ వేలం పాట నిర్వహణలో అధికారులు శశిధర్, శ్రీధర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు బాగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని మండల విద్యాధికారి రాథోడ్ అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ కస్తూర్బా పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మె చేస్తున్న కారణంగా రోజు విద్యార్థులకు పాఠాలు చెబుతున్నామన్నారు.



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈఓ పీపీ రాథోడ్

స్టాప్ ఓ చోట.. బస్సులు ఆగేది మరోచోట..

- మియాపూర్–మదీనాగూడ జాతీయ రహదారిలో ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- బస్టాప్ వద్ద ఆటోలను నిలుపుతున్న వైనం.. కనుమరుగైన బస్ బేలు



మియాపూర్: మియాపూర్–మదీనాగూడ జాతీయ రహదారిలో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. బస్టాప్‌ల వద్ద ఆటోలు ఉంచడంతో ఆర్టీసీ డ్రైవర్లు బస్సులను రోడ్డుపైనే ఆపుతున్నారు. మరికొందరు డ్రైవర్లు నడిరోడ్డుపై నిలిపివేస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మియాపూర్, మదీనాగూడ జాతీయ రహదారిపై పలు బస్టాప్‌లు పేరుకే ఉన్నాయి. బస్సులను స్టాపుల్లో కాకుండా దూరంగా నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులు బస్సులు ఎక్కి, దిగే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, చిన్నారులు, సీనియర్ సిటిజన్స్ అవస్థపడుతున్నారు. బస్సు రాగానే ప్రయాణికులు రోడ్డుకు అడ్డంగా పరుగెత్తి అందుకోవాల్సి వస్తుందని, ఈ క్రమంలో కొందరు కిందపడి ప్రమాదాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మియాపూర్– బొల్లారం రోడ్డులో బస్టాప్ వద్ద ఆటోలు నిలుపుతుండడంతో ప్రయాణికులు ఆటోల మధ్యలో నుండి వెళ్లి బస్ ఎక్కాల్సి వస్తోంది.

ట్రాఫిక్ ఇబ్బందులు..

జాతీయ రహదారిపై ఇష్టారాజ్యంగా బస్సులను నిలపడం వలన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మియాపూర్, మదీనాగూడ జాతీయ రహదారిపై, బొల్లారం రోడ్డులోని పలు బస్టాప్‌ల్లో డ్రైవర్లు రోడ్డుపై బస్సులను ఆపడంతో వెనుక నుంచి వచ్చే వాహనదారులు బస్సు వెళ్లే వరకు ఆగాల్సి వస్తుంది. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా నడుపుతున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులకు సరైన సౌకర్యాలు కల్పించాలని, బస్ బేలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.





మియాపూర్ పరిధి.. మదీనాగూడ ప్రాంతంలో రోడ్డుపై బస్సులు నిలపడంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

పార్క్‌ను కాపాడాలని హైడ్రాకు ఫిర్యాదు

గచ్చిబౌలి: అంజయ్యనగర్‌లోని పార్క్ స్థలాన్ని కాపాడాలని జనం కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం హైడ్రా కార్యాలయంలో అంజయ్యనగర్ ఏపీ హెచ్‌బీ లేఅవుట్‌లో ఉన్న ఎకరం 20 గుంటల పార్క్‌ను కాపాడాలని కోరారు. అవినీతి అధికారులు అక్రమ రిజిస్ట్రేషన్లు, పట్టాలు ఇవ్వడంతో 100 కోట్ల విలువైన పార్క్ అన్యాక్రాంతం అయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

22న సనాతన హిందూ ధర్మ జాగృతి మహాసభ

పంజగుట్ట: దేశంలో 85శాతం హిందువులను ఏకం చేయడానికి అఖండ భారత్ స్థాపనకు ఈనెల 22వ తేదీన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవాలయంలో 'సనాతన హిందూ ధర్మ జాగృతి మహాసభ' నిర్వహిస్తున్నట్లు మహాదేవ మఠం వ్యవస్థాపకులు మహాదేవ్ స్వామీజీ తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని వీర ధర్మజస్వామి, తెలంగాణ జంగమ సమాజం అధ్యక్షులు ఆర్. విశ్వేశ్వరయ్యలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఠం, సనాతన హిందూ ధర్మ జాగృతి సేవా సంస్థల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమం నాదేశం..నా ధర్మం ,సనాతనం మా లక్ష్యం అనే నినాదంతో సాగుతుందన్నారు. కార్యక్రమానికి 108 మంది పీఠాధిపతులు, ధార్మిక సంఘాల పెద్దలు, కుల సంఘాలు హాజరవుతున్నాయని తెలిపారు. దేశంలో హిందువులపై ఎన్నో దాడులు జరుగుతున్నా ఇంకా హిందువులు నిద్రావస్థలోనే ఉన్నారని వారిని జాగృత పరిచేందుకే ఈ కార్యక్రమం చేస్తున్నామని అన్నారు.యావత్ హిందూ సమాజం వారి కుటుంబాలతో కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

గణాంకాలు ఎంతో ప్రాముఖ్యం

సీఆర్‌రావు ఇన్‌స్టిట్యూట్ సీఈఓ డాక్టర్ యుగంధర్



కార్యక్రమంలో సీఈఓ డాక్టర్ యుగంధర్, అజిత్‌కుమార్

రాయదుర్గం: గణాంకాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని సీఆర్‌రావు ఇన్‌స్టిట్యూట్ సీఈఓ డాక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లోని సీఆర్‌రావు ఇన్‌స్టిట్యూట్‌లో ఎన్ఎస్ఓ, ఎన్ఎస్ఎస్ 80వ రౌండ్ సర్వే, ఏఎస్‌యూఎస్ఈ, సవరించిన పీఎల్ఎఫ్ఎస్ ప్రాంతీయ శిక్షణా శిబిరాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సర్వే ప్రధానంగా ఆరోగ్య రంగం, ఖర్చు, ప్రభుత్వ ఆరోగ్య బీమా వివరాలను సేకరించేందుకు నిర్వహిస్తారన్నారు. నాలుగురోజుల పాటు జరిగే ఈ శిక్షణ నైపుణ్యాన్ని పెంచుతుందన్నారు. ఎన్ఎస్ఓ ప్రాంతీయ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అజిత్‌కుమార్ మాట్లాడుతూ సాంఘిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి ఈ సర్వే డేటా ముఖ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శివపార్వతీరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్లు జయరామ్, కేవీస్వామి, సీనియర్, జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు, ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రం నుంచి 150 మంది ఫీల్డ్ ఎన్యూమరేటర్లు, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాస్త్ర, గణాంకాల విభాగం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు

రాయదుర్గం: నాలుగున్నర శతాబ్దాల చరిత్ర కలిగిన రాయదుర్గంలోని హుస్సేన్ షావలీ దర్గా ఉర్సును ఘనంగా నిర్వహించారు. ఉర్సులో పాల్గొనేందుకు నగరం నుంచి, పలు జిల్లాలు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తులు పాల్గొని ఫాతియాల్, పూలమాలలను సమర్పించారు. ఉర్సుతో రాయదుర్గంలో సందడి వాతావరణం నెలకొంది. గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ సాయిబాబా దర్గాలో పూలమాలలు సమర్పించారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ పుష్పనగేష్ అధికారులను కోరారు. మంగళవారం రామచంద్రాపురం వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్‌నగర్ కాలనీలోని బాలవిహార్ పార్కులో పనులు నత్తనడకన సాగుతున్నాయని త్వరగా పూర్తి చేయాలన్నారు. హిందూ శ్మశానవాటికలో షెడ్, బర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లు, బోర్, ఇతర పనులకు అధికారులు వెంటనే ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు శామ్యూల్ వినయ్ కుమార్, నాయకులు హబీబ్, ఐలేష్, నగేష్, శ్రీరాములు, సుంకు స్వామి, మల్లేష్, యాదయ్య, నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు.. అన్నీ అందుతున్నాయ్..

- యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం
- దీంతో సేవలు మరింత పారదర్శకం
- ఖైరతాబాద్‌లో మొదలైన ప్రక్రియ



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్న టీచర్

బంజారాహిల్స్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం, బాలమృతం లబ్ధిదారులకు సక్రమంగా అందేలా 'పోషణ్ అభియాన్ యాప్' దోహదం చేస్తోంది. 2020 ఏప్రిల్ నుంచి వినియోగంలోకి తెచ్చిన పోషణ్ ట్రాకర్ యాప్‌తో లబ్ధిదారులకు సకాలంలో సేవలు అందజేస్తున్నారు. ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రం తెరిచిన వేళలు, పిల్లల హాజరు, గృహ సందర్శన, టీహెచ్ఆర్, కోడిగుడ్లు, బాలామృతం తదితర సమాచారం ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందుతుంది. దీనికి అదనంగా పోషణ్ అభియాన్ యాప్‌లో కేంద్ర ప్రభుత్వం తాజాగా ఫేస్ రికగ్నైజేషన్ (ముఖ ధ్రువీకరణ) సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. దీని ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలు తదితర లబ్ధిదారుల ఫొటోలను నిక్షిప్తం చేసి మరింత పారదర్శకంగా సేవలు అందించనున్నారు. ఐసీడీఎస్ ఖైరతాబాద్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్ తదితర డివిజన్ల పరిధి కిందికి వచ్చే 151 అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖధ్రువీకరణ అమలుకు శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్‌లోని పోషణ్ అభియాన్ ట్రాకర్ యాప్‌ను అప్‌డేట్ చేసుకోవాలని అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు అందజేసిన మొబైల్ ఫోన్‌లోని ఫేస్ రికగ్నైజేషన్ ప్రోగ్రాం ద్వారా లబ్ధిదారుల ఫొటో, ఆధార్ వివరాలు, లబ్ధిదారుల సెల్‌ఫోన్ నంబర్ ఇందులో నమోదు చేస్తారు. ఇది పూర్తికాగానే లబ్ధిదారుల సెల్‌ఫోన్‌కు వచ్చిన వన్‌టైమ్ పాస్‌వర్డ్‌ను ఈ యాప్‌లో పొందుపర్చి ఈ ప్రక్రియను పూర్తిచేస్తారు. ధ్రువీకరించినట్లు ఈ యాప్‌లో సందేశం రాగానే అథెంటికేషన్ పూర్తయినట్లు నిర్ధారణ అవుతుంది. ఇలా ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలోని మొత్తం లబ్ధిదారుల ఫేస్ రికగ్నైజేషన్ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. సజావుగా పూర్తి చేసేందుకు అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కలిగిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా సంబంధిత అధికారులకు అవగాహన కూడా పూర్తయ్యింది. ప్రస్తుతం పోషణ్ అభియాన్ ప్రతినిధులు అంగన్‌వాడీ టీచర్లకు దీనిపై శిక్షణ కూడా ఇస్తున్నారు.

సాంకేతిక సమస్యలతో సేవలకు అంతరాయం..

అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లు పోషణ్ అభియాన్ ద్వారా అందిస్తున్న సేవలకు కంప్యూటర్లు, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. పలువురి అంగన్‌వాడీ టీచర్ల మొబైల్ ఫోన్లు పాతబడ్డాయి. ఇందులోని సిమ్‌కార్డు మరో ఫోన్‌లోకి వేస్తే అవి పని చేయడం లేదు. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సాంకేతిక సమస్యలపై అధికారులు దృష్టిసారించారు. కొత్త సెల్‌ఫోన్లు అందజేయాలని టీచర్లు కోరుతున్నారు. ఈ యాప్ విజయవంతంగా ముందుకుసాగాలంటే ఇప్పుడున్న సెల్‌ఫోన్లు పనిచేయవని పలువురు అంగన్‌వాడీ టీచర్లు ఆరోపిస్తున్నారు. పోషణ్ అభియాన్ యాప్‌లో ముఖ ధ్రువీకరణ చేయాలంటే కొత్త సెల్‌ఫోన్లు ఉండాలని వారు కోరుతున్నారు. యాప్‌ను సక్రమంగా వినియోగించేలా పోషణ్ అభియాన్ ఉద్యోగులు, సిబ్బంది కృషి చేస్తుండగా టీచర్లు మాత్రం తమ సెల్‌ఫోన్లు మొరాయిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ఈనెల నాల్గో వారం నుంచి ఫేస్ రికగ్నైజేషన్ ద్వారా లబ్ధిదారులకు కోడిగుడ్లు, బాలామృతం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

'ఇందిరమ్మ లబ్ధిదారులు' నమోదు చేసుకోవాలి : ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ఇళ్లు లేని పేదలు ఇందిరమ్మ మొబైల్ యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. మంగళవారం ఆయన తన నివాసంలో మాట్లాడుతూ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ పూర్తవుతుందన్నారు. 500 మందికి ఒక సర్వేయర్ ఉంటారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేయని వారు స్పెషల్ కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న జగదీశ్వర్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి డివిజన్ నివాసితులు మధుగౌడ్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ మంగళవారం ఆ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి, నాయకులు మల్లేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లైఫ్ సపోర్ట్ స్కిల్స్‌పై శిక్షణ

శంషాబాద్: కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బేసిక్ లైఫ్ సపోర్ట్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రముఖ కార్డియాలజిస్ట్ మల్‌రెడ్డి హన్మంతరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శంషాబాద్ పట్టణంలోని ఎంఎంఆర్ కన్వెన్షన్ హాలులో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాష్ నారాయణ హాజరుకానున్నట్లు తెలిపారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆస్మాన్ ఫౌండేషన్ సభ్యులు

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆస్మాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ భవిష్యత్తును ఎలా దిద్దుకోవాలి, ఏ కోర్సు చదివితే ఎలాంటి ఉపాధి అవకాశాలుంటాయి అనే అంశాలపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆస్మాన్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, కృష్ణవేణి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఎన్ని ఇబ్బందులు ఉన్నా అధిగమిస్తూ తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి నిరంతరం కృషి చేయాలని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



ఎమ్మెల్యే గాంధీతో అసోసియేషన్ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీని ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1 వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ సభ్యులు కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమిష్టిగా కాలనీ అభివృద్ధికి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బత్తిని వెంకటేశంగౌడ్, ఉపాధ్యక్షుడు తుమ్మల రాంరెడ్డి, జనరల్ సెక్రటరీ మారోజు కుమారచారి, జాయింట్ సెక్రటరీ పంటకాపు రఘు, ట్రెజరర్ కొత్త లక్ష్మి, అడ్వైజర్లు యాదవరెడ్డి, నర్సింగ్‌రావు, భీష్మ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... సోమవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 7 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 6 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమాన, మరో వ్యక్తికి రూ. వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



వేణు (ఫైల్)

మియాపూర్: ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా కల్లకుంట కాలనీకి చెందిన తాటోజు రాములు కుమారుడు తాటోజు వేణు(30) ఆర్కిటెక్. ఈ నెల 6వ తేదీ వేణు ప్రాజెక్టు నిమిత్తం నగరానికి వచ్చి మియాపూర్ యూత్ కాలనీలోని స్నేహితుడి రూంలో ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం స్నేహితుడు పాచికంటి వేణుగోపాల్ సినిమాకు వెళ్లి రాత్రి 7.30 గంటల సమయానికి రూమ్‌కి వచ్చి చూడగా తలుపులు గడియపెట్టి ఉన్నాయి. ఎంత పిలిచినా వేణు తలుపు తీయలేదు. తలుపు సందులో నుండి చూడగా వేణు ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరేసుకుని కనిపించాడు. వెంటనే వేణుగోపాల్ మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా వేణు అప్పటికే మృతి చెందాడు. వేణుగోపాల్ మృతుడి అన్నకు సమాచారం అందించారు. గత కొంతకాలంగా వేణు వ్యాపార నిమిత్తం అప్పులు చేశాడని, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని మృతుడి సోదరుడు పోలీసులకు తెలిపారు. మృతుడి సోదరుడు సతీష్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.